నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

3 | ఖమ్మం, సోమవారం 27 మే 2024 | BHADRADRI KOTHAGUDEM





బ్యాలెట్ బాక్సుకు సీల్ వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ కొండపల్లి శ్రీరామ్




లక్ష్మీదేవిపల్లి మండలం రామచంద్ర డిగ్రీ కాలేజీలో మెటీరియల్ పంపిణీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

# నేడే ఎమ్మెల్సీ పోలింగ్




- ఉమ్మడి జిల్లాలో పట్టభద్రుల ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 8 గంటలకే పోలింగ్ ప్రక్రియ ప్రారంభం
- 1,23,985 మంది ఓటర్లు..
- 173 పోలింగ్ కేంద్రాలు..
- సీసీ కెమెరాలు, పటిష్ట భద్రత నడుమ పోలింగ్‌కు ఏర్పాట్లు
- నేడు పోలింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమలు






పంపిణీ కేంద్రంలో బూత్‌ల వారీగా తీసుకెళ్లాల్సిన సామగ్రిని సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

ఖమ్మం, మే 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి):ఉమ్మడి ఖమ్మం – వరంగల్ – నల్గొండ జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఉప ఎన్నికలో భాగంగా సోమవారం పోలింగ్ ప్రక్రియ ప్రారంభంకానుంది. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ నిర్వహించేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారుల పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి సామగ్రిని తీసుకున్న ఎన్నికల సిబ్బంది.. ఆదివారం సాయంత్రానికే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ప్రశాంత ఎన్నికల కోసం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెరగడంతో పెరిగిన ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాల్లో వసతులను మెరుగు పరిచారు. ఈ ఎన్నికల్లో మొత్తం 52 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా ఇందులో ముగ్గురు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నుంచి ఉన్నారు. మిగతా 49 మంది అభ్యర్థులు వివిధ రిజిస్టర్ పార్టీల అభ్యర్థులతోపాటు ఏ పార్టీల తోనూ సంబంధం లేని స్వతంత్ర అభ్యర్థులు కూడా ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 173 పోలింగ్ కేంద్రాలుండగా.. వాటిల్లో ఖమ్మంలో 118, భద్రాద్రి కొత్తగూడెంలో 55 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో విధులు నిర్వహించేందుకు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈసీ మార్గదర్శకాలు ప్రకారం 20 శాతం అదనపు సిబ్బంది అందుబాటులో ఉన్నారు. సమస్యాత్మక కేంద్రాల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల లోపల కూడా వంద శాతం సీసీ కెమెరాలు ఉన్నాయి.





### 1,23,985 మంది ఓటర్లు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 1,23,985 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వారిలో ఖమ్మం జిల్లాలో 83,879 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 50,676, మహిళలు 33,199 మంది, ట్రాన్స్‌జెండర్లు నలుగురు ఉన్నారు. భద్రాద్రి జిల్లాలో 40,106 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 22,590 మంది, మహిళలు 17,516 మంది ఉన్నారు. అయితే ఓటరు స్లిప్పులు అనేవి కేవలం ఓటర్లకు సమాచారం అందించేందుకు మాత్రమేనని అధికారులు చెబుతున్నారు. పోలింగ్ కేంద్రానికి వస్తున్న సమయంలో ఎన్నికల సంఘం సూచించిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకపోవాల్సి ఉంటుంది. సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసి వేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్ట బందోబస్తు మధ్య నల్గొండలోని స్ట్రాంగ్ రూముకు తరలించనున్నారు. జూన్ 5న కౌంటింగ్ నిర్వహించనున్నారు.

## 'భద్రాద్రి'లో 55 కేంద్రాల్లో ఎన్నికలు

### పటిష్ట భద్రత మధ్య సామగ్రిని తీసుకెళ్లాలి: భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక



జంబో బ్యాలెట్ బాక్సును బస్సులోకి ఎక్కిస్తున్న సిబ్బంది

భద్రాద్రి కొత్తగూడెం, మే 26 (నమస్తే తెలంగాణ):ఉమ్మడి వరంగల్ – ఖమ్మం – నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు భద్రాద్రి జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 55 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఓటింగ్ జరుగనుంది. ఈ మేరకు సామగ్రి పంపిణీ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రిని తీసుకొని ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రానికే తమ పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. లక్ష్మీదేవిపల్లి శ్రీరామచంద్రా డిగ్రీ కాలేజీలో మెటీరియల్ పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ ప్రియాంక పరిశీలించి ఎన్నికల సిబ్బందికి మెటీరియల్‌ను అందజేశారు. 65 మంది పీవోలు, 65 మంది ఏపీఓలు, 152 మంది ఓపీవోలు కలిపి మొత్తం 282 మంది సిబ్బంది ఈ విధుల్లో పాల్గొంటున్నారు.

### జిల్లాలో 40,106 మంది ఓటర్లు..

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ కోసం జిల్లా వ్యాప్తంగా 55 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఓటు హక్కు నమోదు చేసుకున్న పట్టభద్రులు మొత్తం 40,106 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 22,590, మహిళలు 17,516 మంది ఉన్నారు. అత్యధికంగా చుంచుపల్లి మండలం బాబూక్యాంపు 271వ బూత్‌లో 1145 మంది ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటికే 252 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్: కలెక్టర్

సోమవారం నాటి ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే జరుగుతుందని కలెక్టర్ ప్రియాంక తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండలం రామచంద్రా కాలేజీలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ మెటీరియల్‌ను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహించాల్సిన విధుల గురించి ఎన్నికల అధికారులకు, సిబ్బందికి మరోసారి వివరించారు. సామగ్రిని భద్రత మధ్య వాహనాల్లో తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ అయ్యాక తిరిగి ఇదే రిసెప్షన్ సెంటర్‌కు రావాల్సి ఉంటుందన్నారు. అనంతరం వాహనాలకు ఏర్పాటు చేసిన ట్రాకింగ్ సిస్టమ్‌ను కూడా పరిశీలించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఆర్డీవోలు మధు, దామోదర్, తహసీల్దార్ పుల్లయ్య, ఎన్నికల అధికారులు దారా ప్రసాద్, రంగాప్రసాద్, సుశీల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ కేంద్రంలో జంబో బ్యాలెట్ బాక్సులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న సహాయకులు

## ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించాలి

### ఓటు గోప్యతకు విఘాతం కలగకూడదు: ఖమ్మం కలెక్టర్




బ్యాలెట్ పద్ధతిన ఓటింగ్ విధానంపై సిబ్బందికి సూచనలు చేస్తున్న ఖమ్మం కలెక్టర్

మామిళ్లగూడెం, మే 26: ఈసీ మార్గదర్శకాల మేరకు పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. ఉమ్మడి వరంగల్ – ఖమ్మం – నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక కోసం ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏర్పాటుచేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పూర్తి పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఆదివారం రాత్రి అక్కడే బస చేయాలని, సోమవారం ఉదయం పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఉదయం 7:30 గంటల కల్లా పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో జంబో బాక్సుల సీలింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు. జంబో బాక్సు ఖాళీగా ఉన్నట్లు చూపించి, అడ్రస్ ట్యాగ్ చేయాలని, బాక్స్ మూతపెట్టి 2 తాళాలు వేసి, స్టిక్కర్ చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో 800 ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు ఉంటే రెండు ఓటింగ్ కాంపార్టుమెంట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాక్సుల సీలింగ్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటు సీక్రసీకి విఘాతం కలగకూడదని స్పష్టం చేశారు. బ్యాలెట్‌తో కూడిన ఎన్నికల కాబట్టి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఓటరునూ ఫ్రిస్కింగ్ చేయాలని, తనిఖీ చేసిన తరువాతనే అనుమతించాలని సూచించారు. జిల్లాలో 40 లోకేషన్లలో 118 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రిజర్వ్‌తో కలుపుకుని 129 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామన్నారు. పోలింగ్ తరువాత ఎస్ఆర్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి బ్యాలెట్ బాక్సులు వస్తాయని, అక్కడి నుంచి కౌంటింగ్ కోసం నల్గొండకు బందోబస్తుతో చేరుకుంటాయని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఇతర జిల్లా అధికారులు రాజేశ్వరి, గణేశ్, రాజేందర్, శ్రీలత, శ్రీరామ్, మదన్‌గోపాల్, అరుణ, రాంబాబు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రిని బస్సులోకి ఎక్కిస్తున్న సిబ్బంది




### ఎరువుల ప్రణాళిక ఇలా...

| ఎరువులు | కావాల్సిన ఎరువులు (టన్నులలో..) |
|---|---|
| యూరియా | 80,165.94 |
| డీఏపీ | 3,31,154.54 |
| ఎంవోపీ | 25,579.05 |
| కాంప్లెక్స్ | 83,339.09 |
| ఎస్ఎస్‌పీ | 2,580 |



# జిల్లా సాగు ప్రణాళిక ఖరారు

### ఈ ఏడాది జిల్లాలో 7,03,676 ఎకరాలు సాగయ్యే అవకాశం

### మార్క్‌ఫెడ్, టీ సీడ్స్‌కు ఇండెంట్ చేరవేత



ఖమ్మం వ్యవసాయం, మే 26 : మరికొద్దిరోజుల్లో వానకాలం సాగు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున జిల్లా వ్యవసాయ శాఖ ఎట్టకేలకు సాగు ప్రణాళిక ఖరారు చేసింది. ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా వివిధ రకాల పంటలు కలిపి సుమారుగా 7,03,676 ఎకరాల్లో రైతులు సాగుచేసే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేశారు. వీటిలో వరి 2,83,943 ఎకరాలు, మక్కసాగు 3,374 ఎకరాలు, కంది 1,005 ఎకరాలు, పత్తి 2,01,834 ఎకరాలు, పెసర 15,357 ఎకరాలు, మినుము 436 ఎకరాలు, వేరుశనగ 270 ఎకరాలు, చెరుకు 2,432 ఎకరాలు, మిర్చి 88,906 ఎకరాలతోపాటు ఇతర పంటలు మరో 1,06,119 ఎకరాల్లో సాగు అయ్యే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకోవాలని మార్క్‌ఫెడ్, టీ సీడ్స్ కార్పొరేషన్‌కు ఇండెంట్లను పంపించారు.

### విత్తనాల అవసరం ఇలా..

ఈ వానకాలం సీజన్‌లో సాగు జరిగేందుకు వీలుగా అవసరమైన విత్తనాలకు సంబంధించి సైతం జిల్లా వ్యవసాయ శాఖ ముందస్తు విత్తన ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించిన విత్తన ఇండెంట్‌ను తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్‌తోపాటు ఆయా విత్తన డీలర్లకు సైతం అందజేశారు. వరి 70,986 క్వింటాళ్లు, మక్క విత్తనాలు 135 క్వింటాళ్లు, కంది 80 క్వింటాళ్లు, పత్తి ప్యాకెట్లు 5.50 లక్షల ప్యాకెట్లు, పెసర 1,229 క్వింటాల్, మినుము 35 క్వింటాళ్లు, వేరుశనగ 243 క్వింటాళ్లు, మిరప 90 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

# భద్రాద్రి ఆలయానికి పోటెత్తిన భక్తులు

భద్రాచలం, మే 26: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. వారాంతపు సెలవు దినాలు కావడంతోపాటు టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు రావడంతో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో భద్రాద్రికి వచ్చారు. రామయ్యను దర్శించుకునేందుకు అందరూ ఒకేరోజు, ఒకేసారి వచ్చి క్యూలైన్లలో బారులు తీరారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ భక్తులతో నిండిపోయింది. రద్దీని ముందుగానే ఊహించిన ఆలయ అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేయడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగలేదు. ఆలయ ప్రాంగణంలోనూ, క్యూలైన్లలోనూ 'జై శ్రీరామ్' అనే జయజయధ్వానాలతో ధ్వనించాయి.

### రామయ్యకు స్వర్ణ పుష్పార్చన

భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో ఆదివారం సందర్భంగా అంతరాలయంలోని మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చన జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్య బలిహరణం తదితర నిత్య పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. ఆదివారం సందర్భంగా ఉదయం అంతరాలయంలోని మూలవరులకు ప్రత్యేక అభిషేకం జరిపారు. ఈ అభిషేకంలో పాల్గొన్న భక్తులు స్వామిని దర్శించుకొని మురిసిపోయారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను చిత్రకూట మండపానికి తీసుకొని వచ్చి సంప్రదాయబద్ధంగా నిత్యకల్యాణం జరిపి కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేశారు.



భక్తులతో కిటకిటలాడుతున్న భద్రాద్రి రామాలయ క్యూలైన్లు